క్లుప్తంగా

పోషకాహారం తీసుకోండి



తోలేరులో అవగాహన సమావేశం దృశ్యం

వీరవాసరం: మండలంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం తోలేరులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ లక్ష్మి కాంతం మాట్లాడుతూ మహిళలతో పాటు పురుషులు కూడా పౌష్టికాహారం మీద అవగాహన పెంచుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గా భవానీ, వేండ్ర లీలా కృష్ణ, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు ఎంపీడీఓగా బాబూరావు

ఆకివీడు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డి.బాబూరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు పశ్చిమ గోదావరి జిల్లా సీఈఓ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయనను పదోన్నతిపై తూర్పుగోదావరి జిల్లాకు ఎంపీడీఓగా బదిలీ చేశారు. అక్కడ నుంచి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మళ్లీ బదిలీ చేశారు.

మురుగు లేకుండా చర్యలు



బోదె తవ్వకం పనులు పరిశీలిస్తున్న దృశ్యం

కాళ్ల: రహదారులపై మురుగునీరు, బురద ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కాళ్ల పంచాయతీ కార్యదర్శి బి.సతీష్ కుమార్ తెలిపారు. పంచాయతీ పరిధిలోని పలుప్రాంతాల్లో మురుగునీరు, బురద నిలబడకుండా జేసీబీ ఏర్పాటు చేసి మురుగుబోదె తవ్వకం పనులు శుక్రవారం దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం సీజన్లలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టామన్నారు. అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపైకి మురుగునీరు వదులుతున్న వారికి నోటీసులు అందించామన్నారు.

ఘనంగా స్పేస్ రెవల్యూషన్ డే



స్పేస్ రెవల్యూషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: అంతరిక్ష విప్లవంలో భారతదేశం కొత్త శకాన్ని ప్రారంభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పేస్ రెవల్యూషన్ డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యమంలో ఆమె మాట్లాడుతూ ఆర్యభట్ట నుంచి ఆదిత్య వరకూ మన అంతరక్ష ప్రయాణం ఎన్నో విజయాలు సాధిస్తూ అగ్రరాజ్యాలకు దీటుగా నిలిచిందన్నారు. అనంతరం విద్యార్థులు అంతరిక్ష విజయాల పోస్టర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు సీహెచ్‌సీ అనిల్ దాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేండ్రలో పొలంబడి



వేండ్రలో అవగాహన కల్పిస్తున్న భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు

పాలకోడేరు: మండలంలోని వేండ్ర గ్రామంలో మండల వ్యవసాయ అధికారిణి బి.సంధ్య ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించాలాన్నారు. అలాగే పలు అంశాలపై రైతులకు సూచనలు తెలిపారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



ధనుష్ సోమలింగాచారి

భీమవరం: జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో భీమవరానికి చెందిన పి.ధనుష్ సోమలింగాచారి అనే విద్యార్థి ప్రతిభ చాటాడు. ఈ నెల 14న కర్నూలులో ఈ పోటీలు జరిగాయని, అండర్‌-11 విభాగంలో తమ పాఠశాల విద్యార్థి సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడని ఆదిత్య స్కూల్ డైరెక్టర్ కృష్ణంరాజు తెలిపారు.

రైల్వే గేట్లతో అవస్థలు

- గేట్ పడితే తీయడానికి 15 నుంచి 30 నిమిషాల సమయం
- ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల ఇబ్బందులు



శృంగవృక్షం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ రద్దీ



వీరవాసరం రైల్వే గేటు

వీరవాసరం: రైల్వే గేటు పడిన సమయంలో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితులలో ఆసుపత్రులకు, ఇతర కార్యక్రమాలకు వెళ్లే వాహన ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం నుంచి వీరవాసరం మండలం, పెనుమంట్ర మండలం, పాలకొల్లు మండలాలకు సంబంధించిన గ్రామాలకు రావాలన్న, జిల్లా కేంద్రమైన భీమవరానికి వెళ్లాలన్న రెండు రైల్వే గేట్లను దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా వీరవాసరం మండలం, పెనుమంట్ర మండలాల నుంచి భీమవరం వెళ్లడానికి మండల కేంద్రమైన వీరవాసరంలో ఒక రైల్వే గేటు, శృంగవృక్షం వద్ద ఒక రైల్వే గేటు ఉన్నాయి. రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో రైల్వే సిబ్బంది గేటు వేయడంతో గేటుకి ఇరువైపులా పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోతుంది. ముఖ్యంగా జాతీయ రహదారి 165 ఉన్న శృంగవృక్షం-నందమూరి గరువు గ్రామాల మధ్య ఉన్న రైల్వే గేటు పడితే వాహనాలు పెద్ద సంఖ్యలో ఇరువైపులా భారీగా నిలిచిపోతున్నాయి. రైల్వే గేట్ ప్రాంతంలో రైలు వెళ్లిన తదుపరి రైల్వే గేటు తీసిన సమయంలో ట్రాఫిక్ క్లియర్ అవ్వాలంటే ఒక్కోసారి 15 నుంచి 30 నిమిషాలు సమయం పడుతుంది. నిత్యం పెద్ద సంఖ్యలో నరసాపురం నుంచి భీమవరం వైపు, భీమవరం నుంచి నరసాపురం వైపు పెద్ద సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగుతూ ఉంటాయి. విద్యా కేంద్రమైన భీమవరంకు నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రైల్వే గేటు పడితే ఒక్కొక్క గేట్ వద్ద అరగంట పైబడి సమయం వృథా అవుతుందని విద్యార్థులు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే వీరవాసరం, శృంగవృక్షం గ్రామాల్లో ఉన్న రైల్వే గేట్లను దాటుకొని వెళ్లాలంటే ఎప్పుడు గేటు పడుతుందో అంటూ ఆందోళన చెందుతూ రాకపోకలు సాగిస్తున్నారు. రైల్వే గేటు ఇబ్బందుల నుంచి ప్రజలను తప్పించాలంటే శాశ్వతంగా రెండు గేట్ల వద్ద రైల్వే ఫ్లై ఓవర్ గాని అండర్ పాస్ బ్రిడ్జిలు గాని ఏర్పాటు చేస్తే శాశ్వతంగా పరిష్కారం అవుతుందని ప్రయాణికులు కోరుతున్నారు. సంబంధిత రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే తగు చర్యలు తీసుకొని రెండు రైల్వే గేట్ల ప్రాంతాల్లో ప్రయాణికులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమయానికి డ్యూటీకి చేరుకోలేకపోతున్నాం

ఉద్యోగరీత్యా ప్రతిరోజు భీమవరం వెళ్తాంటాను. ఉదయం సమయంలో వీరవాసరం రైల్వే గేట్ పడుతుంది. అక్కడి నుంచి బయటపడి జాతీయ రహదారి ఎక్కేసరికి శృంగవృక్షం గ్రామం వద్దన్న రైల్వే గేట్ కూడా పడుతుంది. రెండు గేట్లను దాటుకుని వెళ్లేసరికి ఒక్కోసారి సమయానికి డ్యూటీకి చేరుకోలేకపోతున్నాను. వీరవాసరం, శృంగవృక్షం గ్రామాల్లో ఉన్న రైల్వే గేట్లు వద్ద ఫ్లై ఓవర్లు నిర్మిస్తే అందరికీ చాలా బాగుంటుంది. తక్షణం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– గెద్దం భాస్కరరావు, రాయకుదురు, ప్రైవేటు ఉద్యోగి

ఎలక్ట్రానిక్ కాటాలకు సీళ్లు



ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్స్ వేస్తున్న దృశ్యం

కాళ్ల: తూనికలు కొలతలు శాఖ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లోని ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్స్ వేసే కార్యక్రమాన్ని శుక్రవారం కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. దీనిలో భాగంగా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ యు.శివమోహన్ సమక్షంలో మండలంలోని 36 రేషన్ దుకాణాల్లోని కాటాలను పరిశీలించి హెచ్చు, తగ్గులను సరిచేసి సీల్స్ వేశారు. కార్యక్రమంలో డీలర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్బారావు, ఓ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి శిక్షణ తరగతులు

కాళ్ల: సుస్థిర అభివృద్ధి లక్ష్యం స్థానికీకరణలో 18 అంశాలపై రెండు రోజులు పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.స్వాతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 23, 24 తేదీల్లో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. రెండు రోజులు పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలకు వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని స్పష్టం చేశారు. శిక్షణ తరగతులు మండలంలోని అన్ని గ్రామ సర్పంచులు, కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి



చినమిల్లి వెంకటరాయుడుకు వీరవాసరంలో స్వాగతం చెబుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

వీరవాసరం: పేదలను వైద్య విద్యకు దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు అంతా సిద్ధంగా ఉన్నారని భీమవరం వైఎస్సార్ సీపీ ఇన్చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు తెలిపారు. పాలకొల్లు మెడికల్ కాలేజీ ప్రాంగణంలో నిరసన తెలియజేయడానికి వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులకు శుక్రవారం వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో వైఎస్సార్ సీపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చినమిల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చిన గొప్ప నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే అని తెలిపారు. మెడికల్ కాలేజీలను ప్రేవేట్ పరం చేయడాన్ని కూటమి ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వీరవల్లి ప్రవీణ్ కుమార్, మండల విద్యావిభాగం అధ్యక్షుడు బండెల సునీల్, ముద్రగడ యేసురాజు, నాగరాజు గోపాలకృష్ణంరాజు, కోరసిక పెద్దిరాజు, పంజా సురేష్, కాండ్రేకుల శ్రీను, సైదు శ్రీనివాస్, మోగంటి నాగేశ్వరరావు, మండపాక రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజీ'కి తరలిన నేతలు



చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో ప్లకార్డులను చూపుతున్న ఉండి నియోజకవర్గ నాయకులు

ఆకివీడు: వైద్య విద్యను పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా కూటమి ప్రభుత్వం చేస్తుందని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఆకివీడు, ఉండి మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, పీవీఆర్‌కే అంజనేయరాజు, పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ ఆరోపించారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయానికి నిరసనగా చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి ఉండి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తరలి వెళ్లాను ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో మెడికల్ కాలేజీలను గత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిర్మాణం చేపట్టారన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు వాటిని ప్రైవేటు పరం చేయాలని తీసుకున్న నిర్ణయం అవివేకమన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ జహంగీర్, జిల్లా అధికార ప్రతినిధి గౌరుముచ్చు సుందరకుమార్, టోనీ, ఈదా జాషువా, మెంటే లక్ష్మణరావు, ఎండీ సిద్దిక్, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌కు విశేషస్పందన



భీమవరం యూత్‌క్లబ్ ఉచిత మెడికల్ క్యాంప్‌లో పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం యూత్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌నకు విశేష స్పందన లభించింది. మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించిన యూత్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు గోకరాజు వెంకటనర్సింహరాజు మాట్లాడుతూ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించడమేగాక సమాజ సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ దుక్కిపాటి నందకిషోర్ ఆధ్వర్యంలో రోగులకు గ్యాస్టిక్, గాల్‌బ్లాడర్, హెర్నియా, అధికబరువు, లివర్ తదితర వ్యాధులకు సంబంధించి వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఇసీజీ, బీపీ, షుగర్, ఫైబ్రోస్కాన్, బీఎంఐ బాడీ కాంపోజిషన్ ఎనాలిసిస్ వంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పేరిచర్ల వెంకటశ్రీనివాసరాజు(సుభాష్) జాయింట్ సెక్రటరీ వేగశ్న రామకృష్ణంరాజు, పేరిచర్ల వెంకటపతిరాజు, వేగశ్న బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి సేవలు మరువలేనివి



భీమవరం సీపీఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

భీమవరం: సనాతన కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఎంచుకుని తన తుదిశ్వాస వరకు సీపీఎం పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మిక వర్గానికి ఏచూరి సీతారామ్ విశేష సేవలందించారని సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్, బి బలరామ్ అన్నారు. శుక్రవారం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా భీమవరంలోని సీపీఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏచూరి రాసిన 805 వ్యాసాలు, 85ప్రసంగాలను, రాజకీయ తరగతుల కోసం తయారు చేసుకున్న 17నోట్స్‌లను పరిశీలించి ముద్రించిన సోషలిస్టు ఆచరణ పథం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు బి వాసుదేవరావు, గొర్లు రామకృష్ణ, శేషపు అక్షియ్య, ఇంజేటి శ్రీను, ఎం వైకుంఠరావు, బి సత్యనారాయణ, ఎస్.కె వలి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలి



రెవెన్యూ గ్రామ సభలో పాల్గొన్న తహసీల్దార్ ఏవి రామాంజనేయులు

వీరవాసరం: రైతులకు రెవెన్యూ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని వీరవాసరం తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు కోరారు. రాయకుదురు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రెవెన్యూ సర్వేలో ఇద్దరు, ముగ్గురు రైతులకు ఉమ్మడిగా ఇచ్చిన ఎల్పీఎంలను విడదీసి ఇవ్వడానికిగాను ప్రతి ఒక్క రైతు ఆసామి దరఖాస్తు చేసుకుంటే వెంటనే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతుల విషయంలో రెవెన్యూ సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతు సమస్యల పట్ల నిత్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, సాగునీటి సంఘం డైరెక్టర్ కొడమంచిలి పాపారావు, వీఆర్వోలు మాండ్రు వెంకట్రావు, హర్ష, కావ్య ,అస్సలాం, బండారు రామారావు, గుడాల శ్రీను, కొడమంచిలి వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి



వీరవాసరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

వీరవాసరం: గామ రెవెన్యూ సహాయకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వీరవాసరం మండల వీఆర్‌ఏల అసోసియేషన్ అధ్యక్షుడు బోరా శంకరం డిమాండ్ చేశారు. వీరవాసరం తాహసీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ వేతనాన్ని పెంచాలని, అర్హులైన వీఆర్‌ఏలకు తక్షణమే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి పెద్ద ఎత్తున నిరసన చేశారు. కార్యక్రమంలో కె వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావు, శ్రీనివాసరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం, కోళ్లపర్రు, గుమ్ములూరు 11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లైన్ల మెయింటినెన్స్ పనుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. పెదకాపవరం, ఆరేడు, బవాయిపాలెం, క్రొవ్విడి, కోళ్లపర్రు, గుమ్ములూరు, తరటావ, ప్రాంతాలోల విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాళ్లలో..

కాళ్ల: జక్కరం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లు నిర్మాణ పనులు నిమిత్తం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్ఎన్ పురం, గాంధీనగర్, జక్కరం, వాండ్రం గ్రామాలతో పాటు సీసలి ఇండస్ట్రీయల్ లైనుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్

ఆకివీడు: మండలంలోని చిన్న పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియకు జిల్లా జీఎస్‌డబ్ల్యూస్ ఇన్‌చార్జి ఉత్తర్వులు జారీ చేశారని ఇన్‌చార్జి ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. మండలంలో నాలుగు రోజుల పాటు ఈ నెల 23 నుంచి 26 వరకూ ఆరు సంవత్సరముల లోపు పిల్లలకు ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు తమ పరిధిలోని పిల్లలను ఆధార్ సెంటర్‌కు తల్లిదండ్రులతో పంపే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 5-7, 15-17 సంవత్సరముల వయస్సు ఉన్న పిల్లలందరికీ మెన్డేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్లు (ఎంబీయూ-2) కోసం ఆధార్ మొబైల్ క్యాంపులను నిర్వహించాలని సూచించారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: మండలంలో 0-6 సంవత్సరాల చిన్న పిల్లలకు రెండు విడతలుగా స్పెషల్ మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి. రెడ్డియ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 23, 24వ తేదీల్లో కుముదవల్లి, వేండ్రలోనూ 25, 26 తేదీల్లో శృంగవృక్షం -1, కోరుకొల్లు, విస్సాకోడేరు -1 క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బాలా త్రిపుర సుందరి అమ్మవారికి వెండి సమర్పణ



అమ్మవారికి వెండి సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి శుక్రవారం దాతలు 212 గ్రాముల వెండి సమర్పించారు. పెదపుల్లేరు గ్రామానికి చెందిన కలిదిండి వెంకట రామసూర్య సత్యనారాయణరాజు, కలిదిండి వెంకటేశ్వరరాజులు 112 గ్రాముల వెండి, భీమవరం గునుపూడికి చెందిన యర్రంశెట్టి శ్రీనివాస్ (వాసు), వెంకటరమణ దంపతులు 100 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

నరసాపురం రూరల్: మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తున్న రాజ్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని వైఎస్‌పాలెం సర్పంచ్ యర్రంశెట్టి నాగముత్యమాంబ అన్నారు. భీమవరం పట్టణానికి చెందిన రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నరసాపురం మండలం యర్రంశెట్టి వారి పాలెం చవ్వాకులవారిమెరకలో గ్రామ ప్రముఖుడు పిట్టా రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కుట్టు మెషీన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు శిక్షణను ఇప్పించి అనంతరం శిక్షణ పొందిన 50 మంది మహిళలకు కుట్టుమెషీన్లను అందించడం అభినందనీయమన్నారు.

జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: హర్యానా రాష్ట్రం అంబాలాలో ఇటీవల నిర్వహించిన సీబీఎస్‌సీ జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో భీమవరం విద్యార్థులు ఏడు బంగారు పతకాలు సాధించారు. శుక్రవారం వారిని వెస్ట్ బెర్రీ పాఠశాల డైరెక్టర్ ఎన్.మహేష్‌కుమార్, ప్రిన్సిపాల్ సారా స్మిత అభినందించారు. తమ పాఠశాల విద్యార్థులు పులపర్తి శ్రీవైష్ణవి 3, అల్లూరి శ్రేష్ఠ వర్మ 2, తోట చైత్ర రిషిత, సింగంశెట్టి భార్గవి ఒక్కొక్క స్వర్ణ పతకాలు సాధించారని తెలిపారు. అండర్-19 విభాగంలో కప్ గెలిచి మొదటి స్థానం కైవసం చేసుకున్నారన్నారు.

వైభవంగా ధన్వంతరి హోమం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం వేదమంత్రాలు నడుమ ధన్వంతరి హోమం నిర్వహించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో ఉండాలనే స్వామివారికి సంకల్పం చేసుకుని శ్రీ స్వామి అమ్మవార్లకు సప్త నదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా పెన్మెత్స. వెంకట రామకష్ణంరాజు పద్మావతి దంపతులతో యాగశాలార్చన, శ్రీ ధన్వంతరి హోమం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం కూడా పలు వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

151 పశువులకు గాలికుంటు వ్యాక్సిన్

యలమంచిలి: వర్షాకాలంలో పశువులను ప్రాణాంతకమైన గాలికుంటు వ్యాధి రాకుండా శుక్రవారం మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేశారు. కనకాయలంక గ్రామంలో శుక్రవారం ఆయన 45 మంది రైతులకు చెందిన 36 ఆవులకు, 115 గేదెలకు వ్యాక్సిన్ వేశారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం శనివారం మట్లపాలెంలో నిర్వహిస్తామని తెలిపారు.